కొండెక్కిన హామీలు

అది ఎన్నికల ప్రచారం.. ప్రభుత్వం ప్రజలకు ఏమీ చేయలేదంటూ పెద్ద ఎత్తున విమర్శలు. కోనాపురం రోడ్డు అధ్వానంగా ఉందంటూ వరినాట్లు వేసి మరీ నిరసన.. తాను అధికారంలో వచ్చిన వెంటనే సుందరంగా రోడ్డు నిర్మిస్తానని హామీ.. చెరువులకు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన.. తాను వస్తే నియోజకవర్గంలోని చెరువులకు నీళ్లిప్పిస్తానని ప్రకటన..పెనుకొండను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని ప్రతిన..తీరా అధికారం చేపట్టిన తర్వాత విస్మరణ.. సోమందేపల్లిలో బస్టాండు అభివృద్ధి చేస్తానని, జయమంగళి నదిపై బ్రిడ్జి నిర్మిస్తానని ప్రజలకు భరోసా..ఏకంగా మంత్రి అయినా హామీలకే దిక్కులేని దుస్థితి.. ఇదీ మంత్రి సవిత నిర్వాకం. వంద రోజుల పాలన పూర్తయినా పై హామీల్లో ఒక్కటంటే ఒక్కటీ అమలు చేస్తే ఒట్టు.





శిథిలావస్థలో పసరక్కర బావి

- పెనుకొండ అభివృద్ధి హుళక్కే..
- చెరువులకు రాని నీరు.. రైతులకు తప్పని కన్నీరు
- అంధకారంలో పెనుకొండ వాసులు
- 100 రోజులైనా ఎన్నికల హామీలపై దృష్టి సారించని మంత్రి సవిత

పెనుకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా పెనుకొండ నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. ఎన్నికల ముందు మంత్రి సవిత ఇచ్చిన హామీలు అమలు చేస్తారేమోనన్న ఆశతో వేయికళ్లతో ప్రజలు ఎదురుచూస్తున్నారు. ప్రధానంగా సోమందేపల్లి అంటే తనకు ఎంతో అభిమానమని పేర్కొన్న మంత్రి అనేక సమస్యలు మండల కేంద్రంలో తిష్ట వేసినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెనుకొండ పట్టణ రూపురేఖలు మారుస్తానని సవిత హామీ ఇచ్చారు. కాని ఇప్పటి వరకు రోడ్డు డివైడర్ నడుమ ఒక్క విద్యుత్ లైట్ వేయించుంటే ఒట్టు. పైపెచ్చు పట్టణంలోని శ్రీరాములయ్య కాలనీ, బీటీఆర్ కాలనీ, మారుతీనగర్ ప్రాంతాల ప్రజలు అంధకారంలో విషసర్పాల నడుమ దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారు. ప్రధాన రహదారే అంధకారంగా మారడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇక మడకశిర రోడ్డు సైతం అంధకారంతో నిండి ఉంది. వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన రోడ్డు విస్తరణ పనులు తప్ప మరేమీ పెద్దగా కనిపించడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకం సరేసరి!



శిథిలావస్థలో లక్ష్మీనరసింహ స్వామి ఆలయం

పెనుకొండ రాచరికపు వైభవానికి చిహ్నం. విజయనగర రాజులు ఇక్కడ రెండవ రాజధానిగా చేసుకుని పాలన సాగించారు. అలాంటి పెనుకొండలో శిథిలావస్థలో ఉన్న కట్టడాల రూపురేఖలు మారుస్తానని హామీ ఇచ్చారు. కొండపై ఇస్కాన్ ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి టెంపుల్ నిర్మిస్తున్నట్లు, ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే మంత్రి ప్రకటన ఇప్పించారు. కానీ పనుల్లో పురోగతి లేదన్న విమర్శలున్నాయి. ఇక గ్రామీణ రోడ్ల దుస్థితి మారుస్తానని హామీ ఇచ్చిన మంత్రి పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని కోనాపురం గ్రామానికి రహదారి వేయించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రోడ్డంతా గుంతలు పడి, కంకర తేలి ప్రజలకు, విద్యార్థులకు నరకం చూపుతోంది. ప్రతిపక్షంలో ఉన్నపుడు ఈ రోడ్డు వేయాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై వరినాట్లు వేసిన మంత్రి అధికారంలోకి వచ్చిన అనంతరం పట్టించుకోలేదని ప్రజలు, విద్యార్థులు విమర్శిస్తున్నారు. పేదలకు ఇంటి స్థలాలు, ఇళ్లు ఇప్పిస్తానన్న మంత్రి ఆవైపు కనీసం దృష్టి సారించడంలేదు.

కళాశాల అభివృద్ధికి చర్యలేవీ?

తాను గెలిస్తే తాను చదువుకున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి సవిత అప్పట్లో పేర్కొన్నారు. కాని అందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థులు విమర్శిస్తున్నారు. కళాశాలలో అనేక సమస్యలున్నాయని, వాటి పరిష్కారానికి మంత్రి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా క్రీడా మైదానంపై మంత్రి హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు. ఇక పట్టణంలో పారిశుధ్యం అధ్వానంగా ఉన్నా మంత్రి పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువులకు నీరేదీ..?



నీరు లేక వెలవెలబోతున్న హంద్రీనీవా కాలువ

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే హంద్రీ–నీవా ద్వారా చెరువులకు నీరు నింపుతానన్న మంత్రి ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. కాలువ ద్వారా నీరు వచ్చి ఉంటే పంటలు పండించే వారమని కాని ఆ వైపు మంత్రి దృష్టి సారించడం లేదని చెబుతున్నారు. పలుమార్లు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని చెరువులకు అందించాలని కోరినా పట్టించుకోవడం లేదని గుర్తు చేస్తున్నారు.

జయ'మంగళమే'..



జయమంగళిలో బ్రిడ్జిపైనే పారుతున్న నది నీరు

పరిగి మండలంలోని జయమంగళి నదిపై బ్రిడ్జి నిర్మాణానికి తగిన చర్యలు చేపడుతానని ఎన్నికల ముందు మంత్రి సవిత హామీ ఇచ్చారు. కానీ ఇంత వరకు దాన్ని పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. జయమంగళి నదిలో నీరు పారితే ఏకంగా 2 నెలలు రాకపోకలు నిలిచిపోతాయని వారు గుర్తు చేస్తున్నారు. ఇక పరిగి మండలంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, ఎన్నికల్లో మంత్రి ఇచ్చిన హామీకి భిన్నంగా పని చేస్తున్నారని పరిగి మండల ప్రజలు విమర్శిస్తున్నారు.

వినియోగంలోకి రాని ఆర్టీసీ బస్టాండ్..



సోమందేపల్లిలో అధ్వానంగా మారిన ఆర్టీసీ బస్టాండ్

సోమందేపల్లిలో ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకొస్తానన్న మంత్రి ఇప్పటికీ ఆర్టీసీ బస్టాండ్ గురించి కనీసం ఆరా తీయలేదు. అక్కడికి బస్సులు వచ్చింది లేదు. బస్టాండ్ ప్రాంగణమంతా ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు నిండి అధ్వానంగా మారింది. మందుబాబులకు అడ్డాగా మారింది. ఎన్నికలకు ముందు చేనేతల సంక్షేమానికి పాటుపడుతానన్న మంత్రి అనంతరం మరచిపోయారు. చేనేత వర్గంపై కపట ప్రేమ చూపుతున్నారని తమకు చేసిందేమీ లేదన్న విమర్శలు ఆ వర్గీయుల్లో వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులు చేపట్టాలి..



పెనుకొండలో 100 రోజుల్లో ఎక్కడా అభివృద్ధి పనులు చేపట్టలేదు. గత ప్రభుత్వంలో మెడికల్ కళాశాల పనులు ప్రారంభించారు. అయితే ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని నిలిపివేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధే తప్ప మరే అభివృద్ధి ఇక్కడ కనిపించడం లేదు. ఇప్పటికైనా మంత్రి తాను ఇచ్చిన హామీలు అమలు చేయాలి.

– సత్యనారాయణ, మునిమడుగు, పెనుకొండ మండలం

అభివృద్ధి శూన్యం



మంత్రి సవిత బాధ్యతలు చేపట్టి వంద రోజులైనా ఎలాంటి అభివృద్ధి జరగలేదు. సోమందేపల్లిలో బస్టాండు గురించి పట్టించుకోవడం లేదు. నేతన్న నేస్తం అందకపోవడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మంత్రి తాను ఇచ్చిన హామీలను తప్పనిసరిగా అమలు చేయాల్సిందే.

– ప్రతాపరెడ్డి, సోమందేపల్లి

హామీ మరచిన మంత్రి



100 రోజుల్లోనే ప్రభుత్వం చతికిల పడింది. తాను ఎమ్మెల్యేగా గెలిస్తే జయమంగళి నదిపై బ్రిడ్జి నిర్మిస్తానని హామీ ఇచ్చిన మంత్రి ఆ తరువాత మరచిపోయారు. ప్రజల కష్టాలు కొనసాగుతున్నాయి. ఈ విషయంలో ప్రజలను నిలువునా మోసం చేశారు.

– హరీష్‌కుమార్‌రెడ్డి, ముల్‌మోతుకపల్లి, పరిగి మండలం

హామీల అమలులో విఫలం



మంత్రి సవిత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందారు. కనీసం ఒక్కటంటే ఒక్కటీ అమలు చేయలేదు. బీసీ శాఖామంత్రిగా ఉండి బీసీలకు 50 ఏళ్లకు పెన్షన్ అందించడంలో విఫలమయ్యారు. చేనేత కార్మికులకు ఏ మాత్రమూ న్యాయం చేయడం లేదు. నేతన్న నేస్తంతో అందుకున్న ప్రభుత్వం జగనన్నది. కాని నేడు చేనేత కార్మికులు నేతన్న నేస్తం అందక రోడ్డున పడే పరిస్థితి. మెడికల్ కళాశాల పనులు వంద రోజుల్లోనే ఆపేసిన నీచ చరిత్ర టీడీపీ ప్రభుత్వానిది. ఈ ప్రభుత్వాన్ని ప్రజలు ఛీకొడుతున్నారు. ఇది మంచి ప్రభుత్వం కాదు ప్రజలను ముంచిన ప్రభుత్వం. మంత్రి ఇలాకాలో అభివృద్ధి శూన్యం.

– ఉషశ్రీచరణ్, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ



శంకరరెడ్డి దంపతులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పెనుకొండ/ పెనుకొండ రూరల్: మండలంలో వివిధ సమస్యలతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులను మాజీ మంత్రి పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ శనివారం పరామర్శించారు. పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత శంకరరెడ్డి కుమారుడు వికాస్ రెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈసందర్భంగా ఆమె శంకరరెడ్డి ఇంటికి చేరుకుని ఆయనతోపాటు కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఇటీవల టీడీపీ నాయకుల చేతిలో దాడికి గురైన పార్టీ నేత సుశీలమ్మను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ ఎంపీటీసీ మురళి ఇంటికి చేరుకుని ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న మండల కన్వీనర్ నాగలూరు బాబును పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన అడదాకుపల్లి సర్పంచ్ అలివేలమ్మ భర్త వెంకటరామిరెడ్డిని పరామర్శించారు. రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రామచంద్ర, ఏజీపీ భాస్కరరెడ్డి, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, జయశంకరరెడ్డి,కౌన్సిలర్ సుధాకర రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అంజినరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సునీల్, తయూబ్, సద్దాం, బోయబాబు, చెన్నకేశవ, యాసిన్,గణేష్, నటేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



శ్రీరంగప్పను పరామర్శిస్తున్న ఈరలక్కప్ప

గుడిబండ: అగళి మండలం ఆర్‌జె పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీరంగప్పను నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప శనివారం పరామర్శించారు. శ్రీరంగప్ప ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సమన్వయకర్త ఈరలక్కప్ప బెంగళూరులో ఉన్న శ్రీరంగప్ప నివాసానికి చేరుకుని పరామర్శించారు. అతని వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు దినేష్, లింగరాజు, శివకుమమార్,ఈరన్న, రంగనాథ్ తదితరులు ఉన్నారు.

మృతురాలికి నివాళి



సరళమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గుడ్డంపల్లి వేణురెడ్డి

హిందూపురం: లేపాక్షి మండలం కొండూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత బ్రహ్మానంద రెడ్డి సతీమణి సరళమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న పార్టీ నియోజకవర్గ నేత గుడ్డంపల్లి వేణురెడ్డి, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, నాయకులు చౌళూరు మధుమతిరెడ్డి తదితరులు సరళమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు శ్రీరామ రెడ్డి, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: ఉద్దూరు గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, వార్డు సభ్యుడు శివ తండ్రి మహలింగప్ప(64)అనారోగ్యంతో శనివారం తెల్లవాజామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ స్వారక్క తదితరులు మహలింగప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

హామీలన్నీ నెరవేరుస్తాం



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న మంత్రి

సోమందేపల్లి: ఎన్నికల వేళ ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని మంత్రి సవిత తెలిపారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం గుడిపల్లి, గుడ్డంనాగేపల్లిలో ఆమె పర్యటించారు. ఈసందర్భంగా రోడ్డు నిర్మాణానికి ఆమె భూమి పూజ నిర్వహించారు. అనంతరం సోమందేపల్లిలో ఏర్పాటు చేసిన పోషణ్ మహోత్సవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఐసీడీఎస్ పీడీ నాగమల్లేశ్వరి, ఎంపీడీఓ సరస్వతి, ఎంఈఓ ఆంజనేయులు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ రద్దు చేయాలని వినతి

పాపిరెడ్డిపల్లి సమీపంలో ఉన్న వెలుపుకొండ క్వారీ రద్దు చేయాలని కస్తూర్బా పాఠశాల ఎస్‌ఓ అనిత, విద్యార్థులు మంత్రి సవితకు శనివారం వినతిపత్రం అందజేశారు. క్వారీ వద్ద పేలుళ్లతో ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. ఇదిలా ఉండగా నల్లగొండ్రాయనపల్లి వద్ద 700 సర్వేనెంబరులో గుడిసెలు ఏర్పాటు చేసుకున్న నాయకులు పట్టాలు ఇవ్వాలని మంత్రి సవితకు వినతి పత్రం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం



అమరాపురంలో వినాయకుడి ఊరేగింపు

అమరాపురం: పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఆవరణలో కొలువుదీరిన గణనాథుని నిమజ్జనం శనివారం భక్తిశ్రద్ధలతో సాగింది. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌లో వినాయక ప్రతిమను ఉంచి ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

అగళి: మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ యూత్ స్టార్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు నిమజ్జనం శనివారం ఘనంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ మడకశిర సమన్వయకర్త ఈరలక్కప్ప గణనాథుడు దర్శించుకున్నారు. గణనాథుని విగ్రహాన్ని ట్రాక్టర్‌లో కూర్చోబెట్టి పుర వీధుల్లో ఊరేగించారు. డీజే సౌండ్స్‌తో యువకులు నృత్యం చేస్తూ రంగులు చల్లుకొంటు ముందుగా సాగారు. అనంతరం అగళి చెరువు విగ్రహాన్ని నిమజనం చేశారు.

ప్రశాంత జీవనం అలవర్చుకోండి



ఖైదీలతో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్

హిందూపురం అర్బన్: జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత ప్రశాంత జీవనం అలవర్చుకోవాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్ ఖైదీలకు సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా జైలులో ఉన్న ఖైదీలతో ఏఏ నేరాతో జైలుకు వచ్చారు, న్యాయవాదులు ఉన్నారా, జైలులో ఎలాంటి సౌకర్యాలున్నాయని అడిగి తెలుసుకుఉన్నారు. అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో నేరం చేసి జైలుకు రావడం వల్ల అనేక ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందన్నారు. జైలు నుంచి బయటకు వెళ్లిన తర్వాత ఎలాంటి కక్షలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేని పరిస్థితి లేని వారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. జైలులో నీరు, భోజనం తదితర వాటిని పరిశీలించి వాటిపై ఖైదీలతో ఆరా తీశారు. జైలు సూపరింటెండెంట్ అంజినాయక్, బార్ అసోషియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు ప్రసాద్ రెడ్డి, సంతోషికుమారి, అబ్దుల్లా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌గా సుధాకర్‌రెడ్డి



పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ పెనుకొండ నూతన మండల కన్వీనర్‌గా సీనియర్ నాయకుడు, పుప్పం సుధాకర్ రెడ్డిని నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

సంక్షిప్త సమాచారం

ముగిసిన మండల స్థాయి క్రీడా పోటీలు

మడకశిరరూరల్: కల్లుమర్రి ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల, బాలికల మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం ముగిశాయి. అండర్–14–17 పోటీల్లో వివిధ విభాగాల్లో మంచి నైపుణ్యం పదర్శించి ప్రతిభ కనపరిచిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత పొందారని పీఈటీ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 24న మడకశిరలో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మండల క్రీడల సమన్వయకర్త నాగభూషణం, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

సోమందేపల్లి: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రమేష్ బాబు తెలిపారు. శనివారం వెలుగుమాకులపల్లి క్రాస్ వద్ద ప్రమాదాల నివారణ కోసం రేడియం స్టిక్కర్లు అతికించారు. రోడ్డు పక్కన అడ్డుగా ఉన్న కంప చెట్లను తొలగించారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటుపడదాం

పెనుకొండ: ప్లాస్టిక్ రహిత సమాజానికి పాటుపడాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శనివారం కళాశాలలో చెత్తచెదారాన్ని తొలగించారు. అధ్యాపకులు, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

రొళ్ల: కొడగార్లగుట్ట కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కోరారు. హొట్టేబెట్ట పంచాయతీలో శనివారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా కొడగార్లగుట్ట కాలనీ వాసులు మాట్లాడుతూ నీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సర్పంచ్ ప్రకాష్ నాలుగుగైదు బోరుబావులు తవ్వించినా నీళ్లు లభించలేదని, ఇప్పటికైనా సమస్య తీర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

పెనుకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు జయంతి వేడుకలు ప్రిన్సిపాల్ సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ జయప్ప నేతృత్వంలో కార్యక్రమం చేపట్టారు. గురుజాడఅప్పారావు చిత్రపటానికి నివాళులర్పించారు. సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటాలను అధ్యాపకులు వివరించారు.

వైఫల్యాలే విజయానికి సోపానాలు



మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్

పరిగి: వైఫల్యాలే విజయానికి సోపానాలని హిందూపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శనివారం కొడిగెనహళ్లి బీసీ బాలుర వసతి గృహంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో వారు మాట్లాడారు. విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. మంచి నిర్ణయాలతో క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. ఒకసారి విఫలం చెందినంత మాత్రానా నిరాశకు గురికాకుండా మరింత పోరాట పటిమతో ముందుకెళ్లాలని, అప్పుడే విజయాలు సాధ్యమవుతాయన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకుని ప్రతి విద్యార్థీ ఎదగాలన్నారు. హాస్టల్ వార్డెన్ చిన్నయ్యబాబు, న్యాయవాది సంతోషికుమారి, ఏఎస్‌ఐ జయలత, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు, లోక్ అదాలత్ సిబ్బంది శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయదకుంటలో జేడీఎస్ విజయభేరి

పావగడ: న్యాయదకుంటె గ్రామ పంచాయతీ ఉపాధ్యక్ష స్థానం ఎన్నికల్లో జేడీఎస్ విజయ భేరి మోగించింది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉపాధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షురాలిగా జేడీఎస్ మద్దతుదారాలు రాధమ్మ శివప్ప ఏకగ్రీవంగా ఎన్నికైంది. పంచాయతీలో మొత్తం 19 మంది సభ్యులుండగా వారిలో 17 మంది జేడీఎస్ పార్టీకి చెందిన వారు కాగా ఇద్దరు మాత్రం కాంగ్రెస్‌కు చెందిన వారు ఉన్నారు. కాంగ్రెస్ సభ్యులు ఎన్నికలకు గైర్హాజరయ్యారు. దీంతో 17 మంది జేడీఎస్ సభ్యుల మద్దతుతో రాధమ్మ శివప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తహసీల్దార్ వరదరాజు ప్రకటించారు. జేడీఎస్ సీనియర్ నేత ఎస్‌ఏ ఈరణ్ణ తదితరులు నూతన అధ్యక్షురాలికి అభినందనలు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా నరేంద్ర నాయక్

పావగడ: తాలూకా లోని బెళ్ళిబెట్టు తండా గ్రామానికి చెందిన నరేంద్ర నాయక్ రాష్ట్ర ఉత్తమ సీఆర్పీ ఉపాధ్యాయుడిగా ప్రశస్తి అందుకున్నారు. ఈయన మరిదాసనహళ్ళి క్లస్టర్ రిసోర్స్ పర్సన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. బెంగళూరు బాలల సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ధారవాడ లో జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రశస్తి అందుకున్నాడు. అతని ప్రశస్తి పట్ల స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ, బీఆర్పీ వెంకటేశ్, తోటి ఉపాధ్యాయులు హర్షం ప్రకటించారు.

పిల్లల సంరక్షణకు పాటు పడాలి

పావగడ: అంగన్‌వాడీ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందే ప్రభుత్వ పథకాలు వారికే అందేలా చర్యలు చేపట్టాలని స్థానిక జేఎంఎఫ్‌సీ సీనియర్ సివిల్ న్యాయమూర్తి వి మాదేశ్ కోరారు. స్థానిక డా బీఆర్ అంబేడ్కర్ భవనంలో శనివారం నిర్వహించిన విశ్వ పౌష్టిక దినోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు, బాలింతలు, గర్భిణుల బాగోగులు చూసే బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తలదేనన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హెచ్ శేషానందన్ మాట్లాడుతూ అంగనవాడీ కార్యకర్తలు అంగన్‌వాడీ పిల్లలను తమ పిల్లలు గా భావించి వారిని సంరక్షించాలని సూచించారు. సీడీపీఓ సునీత, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు సుశీలమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి

చిలమత్తూరు: విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని ఎస్‌ఐ మునీర్ అహ్మద్ సూచించారు. శనివారం స్థానిక పొట్టి శ్రీరాములు జెడ్పీహైస్కూల్‌లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఘనంగా హిందీ దివస్

రొద్దం: కోగిర జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జాబిలి చాంద్ బాషా ఆధ్వర్యంలో హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీ ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించేందుకు హిందీ భాషను ఆయుధంగా చేసుకున్నాడన్నారు. హెచ్‌ఎంను హిందీ భాషా సేవా పురస్కారంతో సత్కరించారు.